ఇంత నీచమైనదనీ, బాహ్య సౌందర్యం తప్ప అంతఃసౌందర్యం లేదనీ నే నిన్నాళ్ళూ గ్రహించలేక పోయాను. ఇప్పుడు నేను నిజంగా మనసు మార్చుకున్నాను. రమ కాదు అంతకంటే అందగత్తె అయినా సరే ఉత్త అందం కాదు కావల్సిందని తెల్సుకున్నాను. నువ్వే నాకు కావాలి. మూడవ తేదీ ఉదయం నే నక్కడికి వస్తాను. నే నింక నీతోనే ఉండడం నీక్కూడా సంతోషం కలిగిస్తుందనే అనుకుంటాను.

—నీ శంకరం.

ఆడవాళ్ళు దయాస్వరూపులే కాదు. మనసు గాయపరిచిన వారి మీద పగతీర్చు కుందుకు కఠిన శిలగా కూడా మారగలరు. కోపంతో పాటూ పౌరుషం కూడా పెరిగింది కల్పనలో. నలిగిపోయింది చేతిలో ఉత్తరం.

*    *    *

పెళ్ళయిన కొద్ది రోజులకే రమ స్నేహితురాలైంది శంకరానికి. ఎప్పుడూ రమ ధ్యాసే. రమని గురించిన ప్రశంసలే తన ముందు అన్నీ ....

ఓపికతో భరించింది.

మొదట్లో రమని గురించి ఎన్నో అనుకునేది. పెళ్ళయిన పరాయి మగవాడితో ఒంటరిగా సినిమాలకి షికార్లకి, తిరగడం ఏమిటి? తను మాత్రం ఆడది కాదూ? ఇంకో ఆడదాని సౌఖ్యాన్నీ, సౌభాగ్యాన్నీ దోచుకుపోవడానికి మనసెలా ఒప్పింది? అని బాధ పడేది. తర్వాత, తప్పంతా రమదే కాదు శంకరంకి అందులో భాగం ఉందని తనకి తనే చెప్పుకుంది. ఔను మరి! రెండు చేతులూ కలిస్తేనే కదా చప్పుడు. శంకరం మంచిగా ఉంటే, అతను ప్రోత్సహించక పోతే రమ ప్రవర్తన అలా ఎందుకుంటుంది? ఏమైతే మాత్రం ఏం లాభం? గుండెల్లో

బాధ గునపాలై గుచ్చుకున్నా ఏమీ చెయ్యలేని నిస్సహాయురాలై చూస్తూ ఊరుకుంది తను.

ఇలా జరుగుతున్న, నడుస్తున్న విషమ పరిస్థితిలో ఊహించిన సంఘటనే ఎదుర్కోవలసి వచ్చింది తను. "ఆ రమ తనని పెళ్ళిచేసుకోమంటోంది. ఎలా చెప్పు" అంటూ ఆ రోజు భర్త అన్న మాటలు విని అసహ్య పడింది. అతన్ని చూసి, ఇటువంటి మనిషితో కలిసి బ్రతకడం కష్టమే ననుకుంది. అందుకే ఎంతో బాధని మనసులో అణిచి పెట్టుకుని, అతనైనా సుఖపడితే అంతే చాలనుకుని సూటిగా చెప్పేసింది "మీ కిష్టమైతే చేసుకోండి. నేను అడ్డు ఉండను."

ఆ మాటతో, తనకి కలిగిన సంతోషం పైకి కనిపించకుండా ఉండడానికి విఫలయత్నం చేశాడు.

"పచ్చని జీవితం పాడు చేసుకోకు. నువ్వు ఊ అన్నాక వాడు అంత పనీ చెయ్యక కూచుంటాడా ? నీ అంతట నువ్వే ఒప్పేసుకుంటే ఇంక వాడికి అడ్డేమిటి ? కావలిస్తే కోర్టుకైనా ఈడ్చి వాడి అంతు తేల్చుకుందాం." అంటూ ఎన్నో విధాల కల్పనకి నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు తండ్రి. అన్నిటికీ కల్పన సమాధానం ఒక్కటే "భయపెట్టి, బవంతపెట్టి అతనితో జీవితం గడపాలన్న తెలివి తక్కువ కోరిక నాకు లేదు. అటువంటి జీవితం ఇద్దరికీ కూడా సుఖమయం కాదు."

శంకరం దగ్గిరే ఉంటోంది రమ.

దూరపు వూరు ఎన్నుకుని వచ్చి టీచరు ఉద్యోగంలో చేరింది కల్పన.

"ప్రతి నెలా నీకు ఎంతకావాలో చెప్పు కల్పనా। పంపిస్తాను. ఉద్యోగం యెందుకు ?" విడిపోయే రోజు శంకరం అన్న మాటలవి. సులభంగా తన సమస్య పరిష్కారం అయిపోయినందుకు అతనికి నిజంగానే హృదయం నిండా ఆనందం.

భర్త మాటలకి కల్పన కళ్ళనిండా నీళ్ళు.

"ఒక్క పైసాకూడా నా కెప్పుడూ పంపించక్కర్లేదు." అని ఖచ్చితంగా చెప్పింది.

ఇద్దరిమధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు. పూర్తిగా శంకరాన్ని మర్చిపోవాలనుకునేది. కానీ మనసులో జ్ఞాపకాలు కదుల్తూనే వుంటాయి ....అందులో... భర్త....అంత తేలిగ్గా ఎలా మర్చిపోగలదు?

తన భర్తలాగే తన మనసూ చంచలమైన దైతే ఈపాటికి ఎన్నో సుఖాలు అనుభవిస్తూ ఉండేది. కానీ సుఖంకన్నా సౌశీల్యం మిన్న అన్న సంగతి మర్చిపోలేదు తను....మర్చిపోదు కూడా....

చంద్రం తనతో కల్పించుకుని మరీ కబుర్లు చెప్తాడు.

అటువంటి స్నేహాలు తనకి కొద్దిగాకూడా నచ్చవు.

తనతో కబుర్లు చెప్తుంటే వాన కురుస్తున్నప్పుడు వేడి వేడి పకోడీలు తింటున్నట్టు వుంటుందట చంద్రానికి.

అతనలా పొగుడుతుంటే నవ్వొస్తుంది.

తనకి మాత్రం అతనితో మాట్లాడితే చల్లారిపోయిన కాఫీ తాగుతున్నట్టే ఉంటుంది.

శంకరం ఆ రమతో వెళ్ళిపోయాడు కదా అని తను ఈ చంద్రంతో వెళ్ళిపోగలదా?

తను ఊ అంటే చాలు....తీసికెళ్ళి తనని పువ్వుల్లోపెట్టి చూసుకోడానికి సిద్ధంగా వున్నాడు....కానీ మనిషికి కావలసింది అదొక్కటేనా? గుణం, శీలం లేనినాడు గుండె ఆగిపోతేనేం? అందుకే మంచి గుణాలు మరుగు పడిపోకుండా మనుగడ సాగిస్తోంది.

ఉత్తరంలోని ప్రతి వాక్యం కల్పన కళ్ళముందు కదుల్తోంది. రమ మనసు నీచమైనదని కోపంతో రాస్తున్నాడే కానీ, కట్టుకున్న భార్య కంటే అందగత్తె కనిపించగానే చలించపోయిన తన మనసు పవిత్ర మైనదా? భర్తని తలుచుకుని అంత బాధలోనూ చిన్నగా నవ్వుకుంది కల్పన.

ఇన్నాళ్ళూ తన సంగతైనా పట్టించుకోకుండా హాయిగా కాలం గడిపి, ఇప్పుడు తను కావాలంటే మాత్రం అటువంటి భర్త దగ్గర ఎందు కుండాలి?....

అక్కర్లేదన్నప్పుడు దూరంగా తప్పుకుని, కావాలన్నప్పుడు కల్సి ఉండడానికి తనేం మరబొమ్మ కాదు.

అందరిలాగే తనూ ఒక మనిషి. తనకీ ఒక మనసంటూ వుంది. ఇదివరకు మనసంతా కోరికలూ, ఏవో తెలియని ఆశలూ, నిండివుండేవి. ఇప్పుడు బాధ, కోపం తప్ప మరేమీ లేవు.

అసలైనా ఇప్పుడుమాత్రం భార్య ఎందుకు కావల్సివచ్చింది?

ఆ రమ వెళ్ళిపోయింది కాబట్టే కదా!

లేకపోతే ఇప్పుడుకూడా తను జ్ఞాపకం వచ్చి ఉండేది కాదుగా!

ఇదే కల్పన మనసుని మరింత గాయ పరుస్తోంది.

ఆత్మహత్య చేసుకోవాలన్న నిశ్చయాని కందుకే వచ్చింది.

ఆత్మహత్య అన్నది కొద్దిగాకూడా ఇష్టంలేని వాళ్ళల్లో కల్పన కూడా ఉంది.

ఎవరో పరీక్షపోయి ప్రాణం తీసుకున్నారన్న వార్తవిని చదువుకునే రోజుల్లో బావతోటి ఒకసారి అంది. "పరీక్ష పోవడం అనేది జీవితంలో ఎంతో చిన్న విషయం కదా! దానికే ఆత్మహత్య చేసుకోవడం ఎందుకు చెప్పు? శుద్ధ తెలివితక్కువ కాకపోతే .... జీవితంలో ఎంత భరించలేని కష్టనష్టాలొచ్చినా ఆత్మహత్యమాత్రం చేసుకోకూడదు" అని అందుకే ఇన్నాళ్ళనించీ కట్టుకున్న భర్త నిర్లక్ష్యం చేసినా ఊళ్ళోవాళ్ళు సూటిపోటి మాటలంటున్నా అన్నీ భరిస్తూ మొండిగా బ్రతుకీడుస్తోంది తప్ప ఆత్మహత్య అన్నది తలపెట్టలేదు .... కానీ .... ఇప్పుడు .... ఏది ఇష్టంలేదో అదే చేయడానికి నిశ్చయించుకుంది.

పాత రోజులు, ఆ అసహ్యమైన రోజులు జ్ఞాపకం వస్తుంటే అతని మొహం చూస్తూ, అవే తల్చుకుంటూ బ్రతుకు అతనితో గడిపేదెలా? శాంతిగా జీవించేదెలా? తనని నిర్లక్ష్యం చేసి ఇన్నాళ్ళూ ఉండి, ఇప్పుడా రమ మోసంచేసి వెళ్ళిపోయిందని "కల్పనా నువ్వు కావాలి" అంటూ వచ్చే భర్తతో జీవితం సాగించడానికి తన మనసు ఒప్పుకోవద్దూ? కల్పన హృదయంలో పౌరుషం రెచ్చగొట్టిందీ ప్రశ్నే....

"కల్పనా నువ్వు కావాలి" అంటూ వచ్చే భర్తకి తన మృతదేహం మాత్రమే కన్పిస్తుంది....

"అటు రమా లేదు, ఇటు కల్పనా లేదు" అని కొద్దిగా కాకపోతే కొద్దిగానైనా బాధ పడకపోడు.

తనని ఇన్నాళ్ళూ ఏ తృప్తీ, ఏ శాంతీలేకుండా బాధతో గడిపేటట్లు చేసినందుకు ఆమాత్రం బాధ అతను అనుభవించితే ఏం పరవాలేదు.

గాయపడిన కల్పన మనసులో రగులుతున్న కోరిక అది.

ఆ రాత్రి స్లీపింగ్‌పిల్స్ సేవించి సంతోషంగా మృత్యువు నాహ్వానించింది.

మగతగా కళ్ళు మూస్తూ ప్రక్కమీద వాలి అనుకుంది బావతో పెళ్ళి కారణాంతరాలవల్ల తప్పిపోయినప్పుడు 'విధి' అన్నారు పెద్దవాళ్ళు. కాబోలనుకుంది తను. ఇప్పుడు ఆత్మహత్య అంటే అసహ్యించుకునే తను పగ తీర్చుకోడానికే అన్నట్టు ఆ ఇష్టంలేని పనే చేస్తోంది. విధే తనచేత ఈ పని చేయిస్తోందా ? ఏది ఏమైనా బావ అన్న దాంట్లోకూడా నిజం లేకపోలేదు.

చీకటి కరిగి వెలుగు వ్యాపించింది. క్రిందటిరోజు రాత్రి రైలు ప్రమాదంలో మరణించిన అల్లుడు మరి రాడన్న సంగతి ఎరగని మామగారు అల్లుడి రాకకోసం స్వాగత సన్నాహం సంబరంగా చెయ్యాలని, తెల్లగా తెల్లారినా నిద్రలేవని కూతుర్ని గది బయట నించి గొంతునిండా ప్రేమ నింపుకుని ఆప్యాయంగా పిల్చాడు "కల్పనా! లేమ్మా తెల్లారింది. లేచి తొందరగా తెములు స్టేషన్‌కి వెళ్ళొద్దా మనం."

తండ్రి పిలిచే పిలుపుకి బదులు పలకలేదు కల్పన, విధి కౌగిట్లో కరిగిపోయిన కల్పన.

★

[illegible] పబ్లిషింగ్ హౌస్
ఏలూరురోడ్డు • విజయవాడ-౨